క్లుప్తంగా

ముఖ్యమంత్రి సహాయనిధికి భారీ విరాళం



చెక్కును సీఎంకు అందిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ విద్యా సంస్థల తరపున ముఖ్యమంత్రి సహాయ నిధికి భారీ విరాళం అందజేశారు. సీఆర్‌ఆర్ విద్యా సంస్థల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్ రూ.2 కోట్లు, ఉపాధ్యక్షుడు ఏవీ సుబ్రహ్మణ్యం రూ.కోటి, గవర్నింగ్ బాడీ సభ్యులు వెలమాటి జనార్థనరావు రూ.కోటి, వీవీ బాలకృష్ణారావు రూ.5 లక్షలు, సిబ్బంది, యాజమాన్యం రూ.20 లక్షలు, మాగంటి రాజారామ్మోహనరావు రూ.25 వేలు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ కె.హిమబిందు రూ.50 వేలు వెరసి మొత్తం రూ.4,25,75,000 బుధవారం నగరంలో పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు.

వైభవంగా వినాయక నిమజ్జనాలు



కొత్తపేట దాసరి ఎర్రయ్య వీధి గణపతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేట దాసరి ఎర్రయ్య వీధిలో లక్ష్మీ గణపతి మహోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉత్సవాల సందర్భంగా గణేష్ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారితో పాటు ఐదు రోజులు విశేష పూజలు అందుకున్న 5 కేజీల లడ్డూకు లక్కీ డ్రా నిర్వహించగా, కలం పరమేశ్వరరావు అనే స్థానికుడు లడ్డూను దక్కించుకున్నాడు. స్వామివారికి సమర్పించిన మిగిలిన లడ్డూలను అన్నసమారాధనలో ప్రసాదంగా పంచుతామని కమిటీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ట్రాక్టర్ వాహనానికి వివిధ రకాల పుష్పాలతో, మామిడి తోరణాలతో స్వామి వారి జెండాలతో సుందరంగా అలంకరించి నిమజ్జనానికి స్వామి వారిని తరలించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు మండలంలోని కొమడవోలు – ఆటోనగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈ నెల 13వ తేదీన నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జేపీబీ నటరాజన్ తెలిపారు. ఆటోనగర్, కొమరవోలు, తూర్పులాకులు, సాయి నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

కొల్లేరు ప్రజల కన్నీటి కష్టాలు

- పట్టించుకోని ప్రభుత్వం
- కనీస సహాయం అందని వైనం



నీట మునిగిన కొల్లేరు గ్రామం గుడివాకలంకలోని ఎస్సీకాలనీ

ఏలూరు రూరల్ : వారం రోజులుగా గ్రామాల చుట్టూ వరదనీరు, నీట మునిగిన తాగునీటి చెరువులు, శ్మశానాల్లో తేలియాడుతున్న సమాధులు, బయటకు పోయే దారి లేదు.. ఇది ఏలూరు రూరల్ మండలంలోని కొల్లేరు గ్రామాల్లో నెలకొన్న పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందుకుంటుందని పేదలు ఆశగా చూస్తున్నారు. మొండికోడు, గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, పెదయాగనమిల్లి, కోమటిలంక గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందించలేదు. తాగడానికి సురక్షిత నీరు, నిత్యావసర సరుకులు అందించలేదు. కొల్లేరు నడిబొడ్డున చిక్కుకు పోయిన కోమటిలంక ప్రజలను సైతం ప్రభుత్వం ఆదుకోలేకపోయిందని స్థానికులు వాపోతున్నారు. గుడివాకలంక ఎస్సీ కాలనీలో వరదనీరు చేరి ఇళ్లు నీట మునిగాయి. అధికారులు ఎవ్వరూ ముంపు బాధితులను ఇప్పటి వరకు పరామర్శించలేదని పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం వరదనీరు బయటకు పోయేందుకు మార్గం లేదని వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సైతం తమ గ్రామ పరిస్థితిని కళ్లారా చూసిన, కనీస సాయం అందలేదని కోమటిలంక ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు కలకుర్రు గ్రామస్తులకు మాత్రమే తూతూ మంత్ర సాయం అందించారని చెబుతున్నారు.

భయం భయంగా గడుపుతున్నాం



వరద మా ఊరును చుట్టు ముట్టేసింది. పిల్లా పాపలతో భయం భయంగా గడుపుతున్నాం. ఒక్కరంటే ఒక్కరూ కూడా మా ఊరుకు రాలేదు. కనీసం కన్నెత్తి చూడలేదు. ఏం చేస్తున్నారు. ఏలా తింటున్నారో అడిగిన వారే లేరు. మరో రెండు అడుగులు పెరిగితే మా పరిస్థితి ప్రమాదకరంగా మారేది. మొత్తం ఊరుంతా కొట్టుకుపోయేది.

– బలే దుర్గ, పెదయాగనమిల్లి

ఆకలితో అలమటిస్తున్నాం



కొల్లేరుకు వరదలు రావడంతో మాకు కష్టాలు ప్రారంభమయ్యాయి. రెండు వారాలుగా చేసుకునేందుకు పని లేదు. వరద తగ్గిన తర్వాత పొట్ట తిప్పలు మొదలెట్టాలి. అప్పటి వరకు ఇల్లు గడిచేది ఎలా. కడుపు నింపుకోవడం ఎలా. ప్రభుత్వం కనీసం నిత్యావసర సరుకులు అందిస్తే బాగుంటుంది. లేకపోతే ఆకలితో అలమటించాలి.

– బలే రాజేశ్వరి

తాగునీరు లేదు



వరదలు వస్తే తాగడానికి సురక్షిత తాగునీరు కూడా ఇవ్వలేదు. వరదనీటితో కలుషితమైన చెరువుల నీరే ఇప్పటికీ తాగుతున్నాం. దీంతో జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది. కనీసం వరదలు వచ్చినప్పుడైనా అధికారులు సురక్షిత తాగునీరు అందించలేరా.. కష్టాల సమయంలోనైనా ప్రభుత్వం పట్టించుకోకపోతే మేం ఏం కావాలి.

– బలే రమేష్

శాశ్వత పరిష్కారం చూపాలి



కొల్లేరుకు వరదలు వచ్చిన ప్రతిసారీ ఊరు దారులన్నీ మునిగిపోతున్నాయి, ప్రజలు పిల్లాపాపలతో బిక్కుబిక్కుమంటూ ఇళ్లలోనే ఉండిపోతున్నారు. ప్రభుత్వం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. లేదంటే కొల్లేరు ప్రజలు జీవితాలు గట్టెక్కవు. వరదలు వచ్చిన ప్రతిసారీ అధికారులు కోసం వేచిచూడాల్సి దుస్థితి వస్తోంది. – పల్లెం ప్రసాద్, పైడిచింతపాడు

ఉపాధి లేదు



మా జీవనాధారం చేపల చెరువులే. చేపల పట్టుకోవడం, అమ్ముకోవడం మా వృత్తి. పది రోజులుగా ఇళ్లు కదిలి వెళ్లే పరిస్థితి లేదు. చేసుకునేందుకు పని లేదు. పూట గడవడమే కష్టంగా మారింది. మా బాధలు తెలుసుకునేందుకు, కనీసం ధైర్యం చెప్పేందుకైనా అధికారులు ఎవ్వరూ రాలేదు. ప్రభుత్వం అంటే ఇలాగే వదిలేస్తుందా?

– బలే పుల్లమ్మ, పెదయాగనమిల్లి

అట్రాసిటీ చట్టం బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. 1989 ఎస్సీ, ఎస్టీ ప్రివెన్స్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ అమల్లోకొచ్చి 35 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక నరసింహారావుపేటలోని ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మాలజాతి యోధుల పోరాట సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్ర విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ అట్రాసిటీ చట్టం ఎస్సీ, ఎస్టీలకు వజ్రాయుధమని, దీని బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ చెప్పిన విధంగా గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో నాయకులు పల్లెం ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తోకల రాజేష్, దాసరి శ్యామ్, నూకపెయ్యి కార్తీక్, కొరబండి బాబూరావు, గారపాటి నాగేశ్వరరావు, ఎం సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోనస్ బకాయిలు చెల్లించాలి

భీమడోలు: హైకోర్టు ఆదేశాల మేరకు బోనస్ బకాయి సొమ్ము తక్షణమే చెల్లించాలని సూరప్పగూడెం సహకార చక్కెర ఫ్యాక్టరీ విశ్రాంత ఉద్యోగులు, కార్మికులు కోరుతున్నారు. ఈ మేరకు భీమడోలులో బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. సూరప్పగూడెంలోని సహకార చక్కెర ఫ్యాక్టరీని నష్టాల సాకుతో 2003 డిసెంబర్‌లో నాటి ప్రభుత్వం అమ్మేసిందని తెలిపారు. 1996 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బోనస్ నిబంధనల మేరకు అర్హత గల ఉద్యోగులు, కార్మికులను బోనస్ ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే 200-01, 2001-02, 2002-03 చెరకు బోనస్ మొత్తాలను చెల్లించలేదని తెలిపారు. ఫ్యాక్టరీ అమ్మగా వచ్చిన నిధుల నుంచి కొంత మొత్తాన్ని 2005లో హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ ఎస్‌బీహెచ్‌లో డిపాజిట్ చేసిందని, ఈ మొత్తం సొమ్మును అర్హులందరికీ అందించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. ఈ ఏడాది జనవరి 12న హైకోర్టు వారు బ్యాంకులో డిపాజిట్ బోనస్ బకాయిల మొత్తాన్ని అర్హత గల 1784 మంది రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులకు అందజేసేలా తీర్పు నిచ్చారని రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధి ఆర్ వెంకటాచార్యులు తెలిపారు. ఈనెల 15న భీమడోలులో సమావేశం నిర్వహిస్తామన్నారు.

నష్టపోయిన రైతులకు రుణమాఫీ చేయాలి

ఏలూరు (టూటౌన్): భారీ వర్షాలు, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతుల పంట రుణాలు మాఫీచేసి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీ ఆడిటోరియంలో జరిగిన కొల్లేరు, తమ్మిలేరు, ఉప్పుటేరు వరద సమీక్ష కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ తరుపున వినతి పత్రం అందించారు. అనంతరం అన్నే భవన్‌లో నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ భారీ వర్షాలకు కొల్లేరు, బుడమేరు, తమ్మిలేరు, ఎర్రకాలువ, గోదావరి వరదలు వల్ల పెదవాగు ప్రాజెక్టు, నూజివీడు పెద్ద చెరువు గండ్లు వల్ల జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పంట నష్టాల నమోదు నిబంధనలు సవరించి పంట ఏ మేరకు నష్టం జరిగినా ఎన్యూమరేషన్ చేసి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. నష్టాల నమోదులో కౌలు రైతుల పేర్లనే నమోదు చేయాలన్నారు. వరికి ఇన్‌పుట్ సబ్సిడీ రూ.6 వేలు నుంచి రూ.10 వేలకు పెంచినట్లు ముఖ్యమంత్రి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ఉద్యాన, వాణిజ్య పంటలకు కూడా ఇన్‌పుట్ సబ్సిడీ పెంచాలని కోరారు. పంటల బీమా పరిహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. నష్టపరిహారం కౌలు రైతులకే అందిస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. డెల్టా ఆధునీకరణ పనులు చేపట్టి పంట, మురుగు కాలువలు బాగు చేయాలని కోరారు. మిత్ర, శ్రీరామకృష్ణ కమిటీల సూచనలు మేరకు కొల్లేరు, బుడమేరు, తమ్మిలేరు, ఉప్పుటేరు వరద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ కోరారు.

అమరవీరుల ఆశయాలను నెరవేర్చుతాం

ఏలూరు (టూటౌన్): విద్యుత్ పోరాట అమరవీరుడు సత్తెనపల్లి రామకృష్ణ, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సాకలి ఐలమ్మ, ప్రజా కళాకారుడు డాక్టర్ గరికపాటి రాజారావుల ఆశయాలను నెరవేర్చుతామని పలువురు నాయకులు పేర్కొన్నారు. అమర వీరుల వర్ధంతి కార్యక్రమం స్థానిక పవరుపేటలోని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. తొలుత ఆయా నాయకుల చిత్రపటాలకు పిచ్చుక ఆదిశేషు, కంది విశ్వనాథం, ఆగొల్ల వెంకటకృష్ణారావులు పూలమాలలు వేసి జోహార్లర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ బ్యాంకుకు ప్రయోగశాలగా మార్చిన చంద్రబాబు నాయుడు విధానాలకు వ్యతిరేకంగా పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలు 100 రోజుల పాటు పెద్ద ఎత్తున వివిధ రూపాల్లో పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఆ పోరాటంలో రాష్ట్ర కేంద్రంలో వృతి సంఘాలు బాధ్యతలు చూస్తున్న సత్తెనపల్లి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి బషీర్‌బాగ్ పోలీస్ కాల్పుల్లో మరణించారని తెలిపారు. లాఠీ చార్జీలో వందలాది మంది క్షతగాత్రులయ్యారన్నారు. ఇంత దారుణం జరిగినా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అయ్యోపాపం అని కూడా అనలేదని, ప్రపంచ బ్యాంకు విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే కర్తవ్యంగా పనిచేయాలని ఆదిశేషు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన వైఎంహెచ్‌ఏ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం (వైఎంహెచ్‌ఏ) సభ్యులు బుధవారం స్థానిక పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. చంటిని శాలువా, పూలమాలతో సత్కరించారు. చంటి మాట్లాడుతూ కళా సంస్థలకు, కళాకారులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వైఎంహెచ్‌ఏ ప్రధాన కార్యదర్శి కళారత్న కేవీ సత్యనారాయణ ఈనెల 26న జరిగే కేవీఎస్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయాలని చంటిని కోరారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు అంబికా రాజా, సహాయ కార్యదర్శి వేమా కోటేశ్వరరావు, కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఎదురుచూపులు

- వలంటీర్లకు వేతనాలు చెల్లించని ప్రభుత్వం
- రూ.10 వేల వేతన హామీ గాలికి

ఏలూరు (టూటౌన్): వారంతా చిరు ఉద్యోగులు. నెలకు రూ.5 వేల గౌరవ వేతనంతో పనిచేసే బడుగుజీవులు వారు. వారిపై కూటమి ప్రభుత్వం కన్నెర్ర చేసింది. గత మూడు నెలలుగా వార్డు వలంటీర్లకు వేతనాలు చెల్లించడం లేదు. దీంతో తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో వారు కొట్టు మిట్టాడుతున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ల వేతనం రూ.10 వేలకు పెంచుతామని ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. పెంపుదల మాట ఎలా ఉన్నా కనీసం గతంలో ఇచ్చే రూ.5 వేలు కూడా ఇవ్వకపోవడంతో వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు.

3 నెలలుగా అందని వేతనాలు

వార్డు సచివాలయాల్లో పనిచేసే వలంటీర్లకు గత మూడు నెలలుగా ఇచ్చే గౌరవ వేతనం నెలకు రూ.5 వేలు సైతం ప్రభుత్వం చెల్లించడం లేదు. తమ బాధలను అర్థం చేసుకుని తమకు ఇవ్వాల్సిన మూడు నెలల వేతనాలు చెల్లించాలంటూ వార్డు వలంటీర్లు ముక్త కంఠంతో కోరుతున్నారు.



వార్డు సచివాలయం

సేవలకు దూరం

గతంలో వలంటీర్లు తమకు కేటాయించిన 50 గృహాలకు సంబంధించి అన్ని పనులు దగ్గరుండి చక్కబెట్టేవారు. ప్రతినెలా ఒకటోతేదీ నుంచి ఐదో తేదీ వరకు ఇచ్చే పింఛన్లను దగ్గరుండి తమ పరిధిలోని ప్రజలకు క్రమం తప్పకుండా అందే విధంగా చర్యలు తీసుకునేవారు. వీటికి తోడు అన్ని ప్రభుత్వ పథకాలను వారికి అందేలా ప్రజలకు మార్గ నిర్దేశం చేసేవారు. అలాంటి వలంటీర్ల సేవలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం వినియోగించుకోకుండా తమ కార్యకర్తలకు ఆ పనులను అప్పజెప్పింది. కావాలనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నియమించిన వలంటీర్లను ప్రజా సేవలకు దూరం పెడుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వలంటీర్ల వివరాలిలా..

ఏలూరులో డివిజన్‌లు	:	50
క్లస్టర్‌లు	:	1484
సచివాలయాలు	:	79
వలంటీర్లు	:	1,434
మొత్తం ఇళ్లు	:	88,366
రేషన్ కార్డులు	:	66,075

తక్షణం వేతనాలు చెల్లించాలి



గ్రామ, వార్డు వలంటీర్లకు వేతన బకాయిలు చెల్లించాలి. గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వలంటీర్ల పట్ల సానుకూలంగా స్పందించి వేతనాలు తక్షణం విడుదల చేయాలి. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు వేతనాలు నెలకు రూ.10 వేలకు పెంచాలి.

– బి.సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ, ఏలూరు జిల్లా

పోతునూరు పారీస్ క్రిస్టిగా జోసెఫ్ తంబి

దెందులూరు: పోతునూరు ఆర్‌సీఎం పారీస్ క్రిస్టిగా ఫాదర్ ఆర్ జోసెఫ్ తంబి నియమితులయ్యారు. ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ఉత్తర్వులను ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి.బాల పోతునూరు ఆర్‌సీఎం చర్చిలో తంబికి అందజేశారు. అనంతరం కెథ్రడల్ రెక్టార్ ఐ.మైఖేల్ సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీ కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్, ఫాదర్ ఇంజేపాల్‌తో కలిపి 15 మంది ఫాదర్లు ప్రత్యేక దివ్యపూజాబలి అర్పించారు. తొలుత గ్రామంలో తంబికి ఘన స్వాగతం పలుకుతూ ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	36
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	22
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - తిరుపతి	16.00	4830	23

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	56	చిక్కుడు కాయలు	120
వంకాయలు (కాంతులు)	64	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	7,10
బెండకాయలు	54	కంద	50
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	36
కాకర కాయలు	34	కీరా దోస	50
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	64	అల్లం	80-160
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	45
క్యారెట్	42	పాలకూర	15
దొండకాయలు	44	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	58	గోంగూర	07
గోరుచిక్కుడు	556	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	--
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	50

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ వినతి



అంబేద్కర్ విగ్రహం వద్ద వర్గీకరణకు వ్యతిరేకంగా నినదిస్తున్న ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలఉద్యోగులు కలెక్టర్‌కు బుధవారం వినతి పత్రం అందించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. దేశ వ్యాప్త ప్రతిఘటన నిరసన ఉద్యమాల్లో భాగంగా మాల ఎంప్లాయిస్ కానిస్టిట్యూషన్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఏఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం, మాల మహానాడు అధ్యక్షుడు దాసరి రమేష్, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు టీఎస్‌డీవీ ప్రసాద్, బేతాళ నాగరాజు, పీవీ సుబ్బారావు, వెంకటేశ్వర్లు, ములగల బెన్హర్, కురమా ఆనంద్ కుమార్, గొర్రె రాజారావు, కాటం విలియమ్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

పెదపాడు : ఇటీవల కురిసిన వర్షాలకు గోగుంట గ్రామం నీట మునగడంతో నిరాశ్రయులైన కుటుంబాలకు దాతల సాయంతో వసంతవాడ గ్రామస్తులు వరద బాధితులకు చీర, పప్పులు, నూనె, బియ్యం కూరగాయాలు, మందులు అందించారు. గోగుంటలో బుధవారం 100 కుటుంబాలకు ఈ సాయం అందించారు. వసంతవాడకు చెందిన ముక్కు సత్యనారాయణ, డాక్టర్ అక్కేన శ్రీరామ మూర్తి, సీహెచ్ రంగారావు, ఎం ఆనందరావు, జి.సుబ్రహ్మణ్యం, ఆర్ ఉమామహేశ్వర రావు, ఎస్ సతీష్‌కుమార్, జి.మణీందర్, రవి, గణేష్, పద్మాకర్, ఏసుబాబు , విశ్వం, అర్జునరావుల ఆర్థిక సాయం అందించారు.

శానిటేషన్ సిబ్బందిని వెనక్కి తీసుకురావాలి

ఏలూరు (టూటౌన్): విజయవాడ బుడమేరు వరద ముంపు సహాయ పనులు నిమిత్తం ఏలూరు నుంచి 10 రోజుల క్రితం పంపిన పారిశుద్ధ్య కార్మికులు 500ని మందిని వెంటనే వెనక్కి రప్పించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఏలూరు నగర కమిటీ కోరింది. ఈ మేరకు నగర కమిటీ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఏలూరు నుంచి వెళ్లిన కార్మికులు, సిబ్బంది అక్కడ అనేక అవస్థలు పడుతున్నారని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. అక్కడ సిబ్బందికి సకాలంలో టిఫిన్లు, భోజనాలు అందడం లేదని తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనులు చేయిస్తున్నారని వివరించారు. సిబ్బంది బస దగ్గర కనీసం టాయిలెట్ల సౌకర్యం లేదని, పడక సౌకర్యం లేదని, నీటిలో పనులు చేయడం వల్ల సిబ్బంది నానా యాతనలు పడుతున్నారని, మహిళల పాట్లు చెప్పనలవి కాదని తెలిపారు. పై పరిస్థితుల దృష్ట్యా విజయవాడ పంపిన పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందిని తక్షణం వెనక్కి రప్పించాలని కోరారు. కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య, అధ్యక్షుడు ఎల్ కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి ఎ.జాన్ బాబు ఉన్నారు.